ప్రజల మాట ప్రగతి బాట

మేడ్చల్ నియోజకవర్గం

# సకల జన సంబురం

## ముసలోళ్లం..నియ్యత్ తప్పం..



ఎప్పుడు చేసుకున్న పుణ్యమో కానీ సీఎం కేసీఆర్ కడుపుల పుట్టిన కొడుకులే కష్టం రాకుండా సూసుకుంటుండు. ముసల్లోలందరికీ ఆసరా పింఛనే మాకు ఆధారమైంది. చేతికర్సులు ఎల్లదీసుకుంటున్న. కడుపుల పుట్టినోల్లే సరిగ్గా పట్టించుకుంటలేరు. కేసీఆర్ సారు సర్కార్ లోకం..లోకాన్నే పట్టించుకుంటుంది. ఎవ్వరు ఎన్ని చెప్పిన ఆయన అన్నం తిన్న నియ్యత్ తప్పం. కేసీఆర్ సారుకే ఓటేసి గెలిపిస్తాం. -గడ్డం కౌసల్య, మాదిగ బస్తీ, ఓల్డ్ విలేజ్, బోడుప్పల్.

## ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం గొప్ప విషయం



సీఎం కేసీఆర్ పేదోళ్లపాలిట దేవుడు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇంత అభివృద్ధి, సంక్షేమాన్ని చూస్తమని అనుకోలేదు. తెలంగాణ వస్తే ఏమొస్తదని ప్రశ్నించిన ప్రతి ఒక్కరికి సీఎం చేసిన అభివృద్ధే సమాధానం.మేనిఫెస్టో నిజంగా పేదల పాలిట వరంలా ఉంది. మేము చిన్న హోటల్ నడుపుకుంటు జీవిస్తున్నం. ఈ రోజుల్లో రెక్కా డితే గాని డొక్కడని బతుకులు ఎన్నో ఉన్నాయి. ఆరోగ్య శ్రీ పరిమితి రూ.15 లక్షల పెంచడం గొప్ప విషయం. మాకే ఆరోగ్య శ్రీ అవసరం ఉంది. ఇప్పుడు రూ.15 లక్షలు పెంచడం మాకు కొండంత ధైర్యాన్ని అందిస్తుంది. అందుకనే కేసీఆర్ పేదలపాలిట దేవుడు.

-సబ్బని నర్సింగ్‌రావు, హోటల్ నిర్వాహకుడు అలియాబాద్.

## వృద్ధుల గురించి కాంగ్రెస్ పట్టించుకోలే..



నిరుపేదల పాలిట సీఎం కేసీఆర్ దేవుడు. వృద్ధులను దగ్గరికి తీసి వారికి నెలానెల పింఛన్ ఇస్తూ ఆసరాగా నిలుస్తున్నాడు. ఎన్నికల్లో మళ్లీ కారు గుర్తుకు ఓటేసి మా దేవుడిని గెలిపించుకుంటాం. వృద్ధుల గురించి గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదు. నిరుపేదల కష్టాలు తెలిసిన కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ రావాలి. ఆయనకు నిరుపేదలు పడుతున్న కష్టాలు తెలుసు. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం ఋణపడి ఉంటాం. -చెట్టి శంకరయ్య, కీసర

## అగ్రవర్ణ పేదల గురించి ఆలోచించడం సంతోషం



సీఎం కేసీఆర్ ఆలోచనలు గొప్పవి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిన గొప్పతనాన్ని చాటుకున్నాడు. ఇప్పుడు అగ్రవర్ణాల్లోని పేదల గురించి ఆలోచించి వారి కోసం గురుకులాలు ఏర్పాటు చేస్తామనడం సంతోషం.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సంబందవర్గాల అభివృద్ధికి అనుక్షణం తాపత్రయ పడుతున్నాడు. ఇలాంటి ముఖ్యమంత్రికే తిరిగి బాధ్యతలు అప్పగిస్తాం. -వంగ లావణ్య, అధ్యాపకురాలు



ఘట్‌కేసర్‌లో పటాకులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు

- బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రకటనతో హర్షాతిరేకాలు
- పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేసిన శ్రేణులు
- మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

**శామీర్‌పేట/ ఘటకేసర్/పీర్జాదిగూడ,అక్టోబర్ 15:** రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ప్రజామ్యానిఫెస్టో ప్రకటన చేయడంతో అన్ని వర్గాల ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్‌లలో, ఆయా మండలాలు, గ్రామాల్లో పార్టీ శ్రేణులు పాటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు.అదేవిధంగా మంత్రి మల్లారెడ్డికి బీఆర్‌ఎస్ నుంచి బీఫామ్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తూంకుంట ప్రధాన చౌరస్తాలోబీఆర్‌ఎస్ తూంకుంట అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వాణివీరారెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావుగౌడ్, హరిబాబు, సురేశ్, కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. అదేవిధంగా ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు,మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రమేశ్,ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పీర్జాదిగూడ పార్టీ కార్యాలయం వద్ద సంబురాల్లో పాల్గొన్న మేయర్ వెంకట్‌రెడ్డి, నాయకులు



తూంకుంట మున్సిపాలిటీలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు.

## అన్ని వర్గాల మేనిఫెస్టో



సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో చాలా బాగుంది. పింఛన్‌తో ప్రధానంగా వృద్ధులు భరోసా లభిస్తుంది. తాజా మేనిఫెస్టోలో పింఛన్‌కు రూ.5 వేలు పెంచాలని, దివ్యాంగులకు రూ.6వేలు పెంచడం సంతోషకరం. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.15 లక్షల వరకు పెంచడంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను ప్రకటించారు -సనగరం శాంతి, ఉపాధ్యాయురాలు, మేడ్చల్

## పింఛన్ పెంపుతో మరింత భరోసా..



పింఛన్ పెరిగితే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మరింత భరోసా కలుగుతుంది. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పలు వర్గాలకు మేలు కల్గించేలా ఉంది.సౌభాగ్యలక్ష్మి పథకం కింద పేదల మహిళలకు రూ.3వేలు భృతి అందిస్తామని ప్రకటించడం సంతోషకరం.రైతుబంధును రూ.16వేలకు పెంచితే రైతుకు, పరోక్షంగా సమాజానికి మేలు జరుగుతుంది. సీఎం కేసీఆర్ వల్లే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుంది. -బుచ్చిబాబు, మేడ్చల్

## ఇంటికి పెద్దకొడుకు లెక్క ఆలోచించిండు..



ఇంటికి పెద్ద కొడుకు లెక్క కేసీఆర్ చేసిన ఆలోచనలు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. పుట్టిన బిడ్డ నుంచి ఇంట్లో పెద్ద మనిషిదాకా ప్రతి ఒక్కరికీ కేసీఆర్ పథకాలు అమలు చేస్తుండు. పెరుగుతున్న ధరలతో కుటుంబం ఇబ్బంది పడొద్దని రూ.400లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించడం గొప్ప విషయం. ప్రజలు బాధలు తెలిసిన ముఖ్యమంత్రి ఉండడం మా అందరి అదృష్టం. సంక్షేమ పథకాలు అద్భుతం. -భూమిరెడ్డి స్వరూప, మురహర్‌పల్లి గ్రామం

## ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు

**మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 15:** కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## డిసెంబర్ 17న అయ్యప్ప గుడి ప్రారంభోత్సవం

**కీసర, అక్టోబర్ 15:** డిసెంబర్ 17వ తేదీన హరిహరపుత్ర అయ్యప్పస్వామి గుడితో పాటు విగ్రహప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించాలని కీసర వేదపండితులు బబ్బూ పంతులు తెలిపారు. కీసరలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పలతో కలిసి ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.

## అనురాగ్‌లో మేరీ మట్టి..మేరా దేశ్



అనురాగ్ యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 15:** దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు ప్రతి ఒక్కరు నివాళులు అర్పించాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ కుమార్ సూచించారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ సమైక్యత కోసం ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు దేశభక్తిని తెలుపుతూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ విజయ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మల్లేష, వలంటీర్లు నవీన్, మధుకర్, కిరణ్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవ దుర్గా యాగంలో గవర్నర్ తమిళి సై

శామీర్‌పేట, అక్టోబర్ 15 : శామీర్‌పేట మండలం అలియాబాద్ రత్నాలయంలో నవ దుర్గా యాగం పూర్ణాహుతి ఆదివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా కడప పుష్పగిరి పీఠానికి చెందిన శ్రీశ్రీశ్రీ విద్యాశంకరజీ భారతీ స్వామిజీ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## కుటుంబకలహాలతో గృహిణి ఆత్మహత్య

**శామీర్‌పేట,అక్టోబర్15:** గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్తూర్ గ్రామానికి చెందిన ప్రవళిక(25) కొంత కాలంగా కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతోంది. దీంతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు కుటుంబీకులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.